# 3 గంటల కాంగ్రెస్ కావాలా...?
# 24 గంటల బీఆర్ఎస్ కావాలా..?

- కాంగ్రెస్‌కు ఓటేసి గోసపడొద్దు...
- అవినీతి పరులను తరిమికొట్టాలి..
- బీఆర్ఎస్ అభ్యర్థి, మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు
- మాదాపూర్‌లో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం

దండేపల్లి, నవంబర్19: వ్యవసాయానికి 3 గంటల కరెంటు చాలు అంటున్న కాంగ్రెస్ కావాలా.. ? రైతుల కష్టాలు తీర్చి 24 గంటల పాటు కరెంటు ఇస్తున్న బీఆర్ఎస్ సర్కారు కావాలా.. ? అనే విషయాన్ని ఓటర్లే నిర్ణయించుకోవాలని బీఆర్ఎస్ మంచిర్యాల అభ్యర్థి, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. దండేపల్లి మండలంలోని మాదాపూర్‌లో వారం రాత్రి నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో భాగంగా సమావేశంలో పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యేకు డప్పుచప్పుళ్లతో స్వాగతం పలికి ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలన వస్తే మళ్లీ కరెంటు కష్టాలు తప్పవని, గతంలో రైతులు కరెంటు కోసం ఎంతో గోస పడ్డారని మళ్లీ ఆ కష్టాలు కావొద్దంటే రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కారు గుర్తుకు ఓటేయాలని పిలుపునిచ్చారు.కాంగ్రెస్ అధికారంలో వస్తే 3గంటలే కరెంటు ఇస్తామని అంటున్నారని, కానీ బీఆర్ఎస్ హాయాంలో 24గంటల కరెంటు ఇచ్చిన సంగతి మర్చిపోద్దన్నారు. ఈ మధ్య కొందరు నాయకులు చివరి నిమిషంలో పార్టీ మారి మోసం చేశారని, కానీ ప్రజల గుండెల్లో కేసీఆర్-కారు గుర్తు అలానే ఉందన్నారు. మోసం చేసిన నాయకులకు బుద్ధి చెప్పాలంటే దండేపల్లి మండలంలో బీఆర్ఎస్‌కు మెజార్టీ రావాలని కోరారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. రాష్ట్రంలో రానున్నది కేసీఆర్ సర్కారే అన్నారు. అవినీతిపరులు, కబ్జాకోరులకు ఇక్కడ స్థానం లేదన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ తిప్పని లింగయ్య, రైతు బంధు సమితి జిల్లా కన్వీనర్ గురువయ్య, నడిపెల్లి ట్రస్ట్ చైర్మన్ విజిత్‌రావు, వైస్ ఎంపీపీ అనిల్, పీఏసీఎస్ చైర్మన్ కాసనగొట్టు లింగన్న, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, సర్పంచ్ డంకా లక్ష్మణ్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, యూత్ నాయకులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

**ఆలోచించి ఓటు వేయండి**

మంచిర్యాలటౌన్, నవంబర్ 19: తొమ్మిదేళ్లలో మీ ముందు జరిగిన అభివృద్ధిని, దానిని చేసిన వారిని గుర్తించి ఒక్కసారి ఆలోచించి ఓటు వేయాలని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఓటర్లను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మంచిర్యాల పట్టణంలోని 27వ వార్డు గౌతమీనగర్, తొమ్మిదోవార్డు పాతమంచిర్యాలలో ఆయన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దివాకర్‌రావు తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఎన్నికల సందర్భంగా పగటి వేషగాళ్లు మీ ముందుకు వస్తారని, గారడీలు చేస్తారని, మాయ మాటలు చెప్పి మోసం చేయాలని చూస్తారని, వారి మాటలు నమ్మవద్దని కోరారు. మీకండ్ల ముందు అభివృద్ధి కనబడుతుందని, ఎవరు అభివృద్ధి చేశారో వారిని గుర్తించి ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఎప్పుడూ ఇటు పక్క రాని ప్రతిపక్ష నాయకులు ఇప్పుడు ఎందుకు వస్తున్నారో అర్థం చేసుకోవాలని, ఎన్నికల్లో గెలవడం కోసం వారు ఏమైనా మాట్లాడుతారని, ఎంతకైనా తెగిస్తారని, అవసరమైతే డబ్బులు పంచుతారని తెలిపారు. మీరు మాత్రం మీ ప్రాంతం ఎవరివల్ల అభివృద్ధి జరిగిందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని, వారు గెలిచినా ఒరిగేదేమీ ఉండదని, మళ్లీ బీఆర్ఎస్ గెలిస్తేనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు ముందుకు సాగుతాయన్నారు. కాంగ్రెస్ నాయకులు 24 గంటల కరెంటు, రైతు బంధు వద్దంటున్నారని, ప్రతి పనికీ అడ్డుతగులుతున్నారని విమర్శించారు. ఇలాంటి నాయకులు ఉంటే ప్రజలు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. అందుకే ఓటువేసే ముందు ఆలోచించాలని, అన్ని రకాలుగా ప్రజల సంక్షేమాన్ని కోరుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌ను గెలిపించాలని, ఈ నెల 30న జరిగే ఎన్నికలో కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, కౌన్సిలర్లు బొలిశెట్టి సునీత, సిరికొండ పద్మ, బీఆర్ఎస్ నాయకులు బొలిశెట్టి కిషన్, తిరుపతి, పెంట ప్రదీప్, రమేశ్‌యాదవ్, కొండల్‌రావు, నాంపల్లి శ్రీనివాస్, బాపు, తదితరులు పాల్గొన్నారు.



దండేపల్లి : మాదాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు



మాదాపూర్‌లో ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు



సభలో పాల్గొన్న ప్రజలు

**బీఆర్ఎస్ నాయకుల ముమ్మర ప్రచారం**

మంచిర్యాలటౌన్, నవంబర్ 19: మంచిర్యాల పట్టణంలోని పలు వార్డుల్లో బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారాలను ముమ్మరం చేశారు. ఆదివారం వికాస్‌నగర్‌లో 28వ వార్డు కౌన్సిలర్ పల్లపు సాయి భార్గవి, బీఆర్ఎస్ నాయకుల పల్లపు తిరుపతి, మసీదు వాడలో కౌన్సిలర్ హరికృష్ణ, హమాలీవాడలో కౌన్సిలర్ నల్ల శంకర్ ఆధ్వర్యంలో మంచిర్యాల బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు తరపున ముమ్మరంగా ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ తిరుగుతూ తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ ముందుకు సాగారు. బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోను వివరిస్తూ ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారుగుర్తుకు ఓటువేసి బీఆర్ఎస్ అభ్యర్థి దివాకర్‌రావును గెలిపించాలని కోరారు. తొమ్మిదేళ్ల క్రితం మంచిర్యాల పట్టణం ఎలా ఉండేదో, ఇప్పుడెలా ఉందో చూడాలని ఓటర్లను కోరుతున్నారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ వార్డు నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

**కారు గుర్తును భారీ మెజార్టీతో గెలిపించాలి**
**-యువనాయకుడు విజిత్‌రావు**

దండేపల్లి, నవంబర్ 19 : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ యువ నాయకుడు నడిపెల్లి విజిత్‌రావు అన్నారు. దండేపల్లి మండలంలోని ధర్మరావుపేటలో ఇంటింటా ప్రచారం చేశారు. మంచిర్యాల నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం పాటుపడిన దివాకర్‌రావును మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలన్నారు. నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే గులాబీ జెండా ఎగురాలన్నారు. అవినీతి పరులకు ఇక్కడ స్థానం లేదన్నారు. కారు గుర్తుకు ఓటేసీ భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమం లో వైస్ ఎంపీపీ అనిల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, మాజీ ఎంపీపీ బండారి మల్లేశ్, ఆయా గ్రామాల యువ నాయకులు ఉన్నారు.

**జన్నారంలో ఇంటింటా బీఆర్ఎస్ ప్రచారం**

జన్నారం, నవంబర్ 19 : మండలంలోని వివిధ గ్రామాల్లో పూర్ణచందర్‌నాయక్, జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్‌ను గెలిపించాలని ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. గ్రామాల్లో ఓటర్లను కలుస్తూ కేసీఆర్ హామీలను ప్రజలకు వివరంగా తెలియజేసి బీఆర్ఎస్ కారు గుర్తుకు ఓట్లు వేసి భారీ మెజార్టీతో జాన్సన్‌నాయక్‌ను గెలిపించి, మూడోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేయాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో రాంటెంకి శంకర్, కమ్మల విజయధర్మ, శ్రీకాంత్ రెడ్డి బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



జన్నారంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేస్తున్న పూర్ణచందర్‌నాయక్

## వైభవంగా సత్యసాయి వ్రతాలు



సత్యసాయి సాయివ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

లక్సెట్టిపేట, నవంబర్ 19: సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీకన్యకాపరమేశ్వరీ ఆలయంలో సత్యసాయిబాబా 98వ జయంతి సందర్భంగా ఆదివారం మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని బాబా వ్రతాలను నిర్వహించారు. సుమారు 98 మంది మహిళలు, దంపతులు ఈ వ్రతాల్లో పాల్గొన్నారు. వేద పండితులు పూజలు చేయించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం సత్యసాయి సేవా సమతి సభ్యులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు రమేశ్, జిల్లా కో కన్వీనర్ గంప రవీందర్, సభ్యులు నగధర్, శ్రీనివాస్, సుధాకర్, రవీందర్, వసంత, రోజా రాణి, వొజ్జల రమ, సుమతి, శారద, పుష్ప, ఉమ, ఆండాలు, కవిత, ఇందిర, శివలీల, శ్రీదేవి, శ్రీవంత, గుండ రమ, మహిళలు పాల్గొన్నారు.

## గూడెంలో కార్తీక సందడి

దండేపల్లి, నవంబర్19: దండేపల్లి మండలంలోని గూడెం రమాసహిత ఆలయంలో కార్తీక మాసం కావడంతో ఆదివారం సందడి నెలకొన్నది. ముందుగా భక్తులు పవిత్ర గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. నదిలో కార్తీక దీపాలు వదిలి, గంగమ్మ తల్లికి పూజలు నిర్వహించారు. అనంతరం గుట్ట పైభాగంలో ధ్వజ స్తంభం వద్ద, గుట్ట కింద భాగంలో రావి చెట్టు కింద దీపాలు వెలిగించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు. అనంతరం అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. దీంతో ఆలయంలో భక్తుల సందడి నెలకొన్నది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.




సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు



← దర్శనం కోసం బారులు తీరిన భక్తులు